# మనసు మాయ

## -వడ్లమూడి దుర్గాంబ

మాలతి నవ్వితే మల్లెలు సన్నజాజులు దోసిలితో మనపై గుమ్మరించినట్టే వుంటుంది. అంత అందమైన, నాజూకైన నవ్వు ఆమెది. నవ్వేకాదు మనిషీ అలాగే వుంటుంది. అందుకే పదిహేనేళ్ళ తర్వాత ఆమెని చూసినా-చూసిన వెంటనే గుర్తుపట్టాడు పురుషోత్తం. సంభ్రమాశ్చర్యాలతో అతనికి నోటమాట రాలేదు. నిజమా అనిపించింది కానీ- అనుమానించాల్సిన అవసరం లేదు. పదిహేనేళ్ళ కాలం ఆమెకి మరికాస్త కొత్త సొబగుల్ని తొడిగిందే కానీ ఆమెలోని అందాల్ని ఏమాత్రం దొంగిలించలేకపోయింది.

ఆ కోలకళ్ళు-నవ్వితే వంపులు తిరిగే పెదవులు- ముఖ్యంగా ముత్యాలు జల జల రాలినట్టుండే ఆ నవ్వు- అతనారోజు ఆఫీస్ నుండి వచ్చేసరికి, ఇంట్లో తన శ్రీమతి శ్రీలతతో పాటు మరో ఇద్దరు ఆడవాళ్ళు కూడా కనిపించారు. ఒకావిడ పక్కింటి పరమశివం భార్య పార్వతి అని తెలుస్తోంది. మరొకామె అటు తిరిగి సోఫాలో కూర్చోవడం వలన అతనికి ఎవరైనది కనిపించలేదు.

పార్వతి పురుషోత్తంని చూసి-''మా ఆడబడుచు మాలతీ లత అన్నయ్యా- కేరళలో వుంటారు. పెళ్ళయిన పధ్నాలుగేళ్ళకి మమ్మల్ని చూడాలనిపించింది అమ్మగారికి-'' ఆవిడ పురుషోత్తంతో చనువుగా మాటాడుతుంది. పక్క-పక్క ఇళ్ళేకదా- ఆడబడుచుని పురుషోత్తంకి పరిచయం చేసింది. మాలతి నవ్వుతూ చేతులు జోడించింది ఇటు తిరిగి. యధాలాపంగా నమస్కరించేందుకు చేతులు ఎత్తిన పురుషోత్తం- ఏమాత్రం అసహజత్వం, తొట్రుపాటు కనిపించకుండా నమస్కారం చేయడానికి అష్టకష్టాలు పడాల్సి వచ్చింది.

కానీ అవతల నుండి అతిసాధారణ పరిచయం తాలూకూ నమస్కారమే వచ్చింది. మాలతి కళ్ళలో ఒక కొత్త మనిషిని చూసిన మామూలుతనం తప్ప-ఎలాంటి కొత్తభావం లేదు. అతి కష్టం మీద చిరునవ్వుతో అతనక్కడి నుండి లోపలి రూంలోకి తప్పుకున్నాడు.

బెడ్ రూంలో-బట్టలైనా మార్చుకోకుండా అలాగే మంచం మీద వాలిపోయాడు. అయితే తనని మాలతి గుర్తుపట్టలేదు. అందులో ఆశ్చర్యపోవాల్సిన పనేమీ లేదు. తను ఆమెని పరోక్షంగా గాఢంగా ప్రేమించాడు గానీ- ఆమె నుండి తనకెలాంటి ప్రతిస్పందన గానీ- గుర్తింపుగానీ లేవు. ఒక్కసారి మాత్రం ఆమె కాలేజీలో చేరిన కొత్తలో లవ్ లెటర్ ఇచ్చి ఓ చెంప దెబ్బతిన్నాడు. అప్పట్నించి తను ఆమెకు ఎదురు పడడం మానుకుని- మనసులోనే ఆరాధించాడు.

మాలతి మనసులో తనకి ప్రేమపూరిత స్థానమేకాదు- కనీసం ద్వేషం కూడా లేదు. అసలు తను ఓ గుర్తుంచుకోదగిన వ్యక్తేకాదు. కానీ తను మాత్రం ఆమెని- ఆమె జ్ఞాపకాలను ప్రేమించడం మానలేదు. కూతురికి మాలతీ లత అనే పేరే పెట్టుకున్నాడు. ఇంటికి 'మాలతీ నిలయం' అనే పేరు పెట్టాడు. కొన్ని ప్రేమలూ, పరిచయాలూ అంతే! జీవితంలో వాటి వలన లాభమూ వుండదు-నష్టమూ వుండదు. జీవితం జీవితం లాగే వుంటుంది. కానీ దీర్ఘకాలంలో మన ఆలోచనలూ, ఆశలూ, ఆశయాలూ, నిరాశలూ, నిస్పృహలూ వీటిపై వాటి ప్రభావం వుంటుంది. కొంతవరకైనా అవి మనను నిర్దేశించ గలుగుతాయి. మనమే గమనించము.

ఆ రాత్రి- మాలతి గురించి, భార్య చెబుతుంటే- పైకి అనాసక్తి నటిస్తూ- అక్షర మక్షరం శ్రద్ధగా విన్నాడు పురుషోత్తం. ఆమె భర్త కేరళలో బిజినెస్ చేస్తాడు. ఇద్దరు ఆడపిల్లలు- చదువుకుంటున్నారు. భర్త ఆమెని చాలా ప్రేమగా చూస్తాడు. ఆమెని వదిలి అసలు వుండలేడు. అందుకే పెళ్ళవగానే కేరళ వెళ్ళిపోయిన ఆమె- అన్నగారింటికి రావడానికి పధ్నాలుగేళ్ళ కాలం పట్టింది. మొత్తానికి మంచి ఆనందమయమైన జీవితం గడుపుతున్న స్త్రీ ఆమె. ఆ విషయం మాలతిని చూడగానే అర్థమైంది పురుషోత్తంకి ఎవరూ చెప్పనవరం లేకుండానే. ఆమెలోని అణువణువులో ఆనందం, సంతృప్తి తొణికిసలాడుతూ- పొంగిపొర్లుతున్నట్టుగా వుంది.

పెరిగే వయస్సు మనిషికి కొత్త అందాలని ఇచ్చిందీ అంటే- అవి పైకి శారీరక అందం రూపంలో బయటపడినా- అంతరంగంలో వాటి అసలు రూపం- ఆనందం, సంతృప్తి సుఖవంతమైన జీవితం ఇవేకదా! చదువుకునే రోజుల్లో తను చూసిన మాలతి నవ్వుకీ- ఈరోజు మాలతి మోములోని నవ్వుకీ ఏమాత్రం తేడాలేదు. ఆ నవ్వుకి ఎంత శక్తి వుందంటే ఒక్కసారిగా తనని పదిహేనేళ్ళ వెనక్కి- ఆ జ్ఞాపకాల్లోకి చాలా బలంగా విసిరివేయగలిగింది.

ఆ రాత్రంతా పురుషోత్తంకి నిద్రలేదు. అసహనంగా పక్కమీద అటూ ఇటూ దొర్లుతూనే వున్నాడు. అది మాలతి కనీసం తనని గుర్తయినా పట్టలేదే అనే దుగ్ధ కావచ్చు. తన బ్రతుకులో, భావాలలో, ఒక భాగంగా చేసుకున్న ఆమె ఆరాధన ఎంతటి నిష్ప్రయోజనమైనదో కళ్ళముందే కనబడుతుంటే అతను తట్టుకోలేకపోతున్నాడు.

పోనీ తనే చెప్పేస్తే- అమ్మో- లేనిపోని గొడవలు తెచ్చిపెట్టుకున్నట్టవుతుంది. తను పట్టుబట్టి కూతురికి పెట్టుకున్న మాలతీ లత పేరు వెనుక- కథ ఏమైనావుందా అనే అనుమానం శ్రీలతకి తనకు తానై కల్పించినట్టవుతుంది. చెప్పకుండా వుందామా అంటే మనసు ఆగడం లేదు. తన ఇన్నేళ్ళ ఆరాధనకి కనీసం ఒక్క చిన్న కృతజ్ఞతా పూర్వకమైన నవ్వయినా ఆమె నుండి పొందాలని- మనసు తహతహలాడుతోంది.

చెప్పాలా, వద్దా- ఈ రెండు భావాలే- ఉచ్ఛ్వాస, నిశ్వాసలైపోయి ఆ రాత్రి అతని చేత జాగారం చేయించాయి.

తరువాత రోజు ఆదివారం. పురుషోత్తం బయటకి ఎక్కడికీ వెళ్ళకుండా- ఇంట్లోనే వుండిపోయాడు. మధ్యాహ్నం నుండి మాలతి తమింట్లోనే వుంది. శ్రీలతకి పార్వతికి మధ్య మంచి స్నేహం వుంది. మాలతి కూడా చాలా కలుపుగోలుగా మాటాడుతోంది శ్రీలతతో. మధ్యాహ్నం టిఫిన్‌కి రెండు రకాల కేరళ వంటకాలు

ఆ రాత్రి-మాలతి గురించి, భార్య చెబుతుంటే-పైకి అనాసక్తి నటిస్తూ-అక్షర మక్షరం శ్రద్ధగా విన్నాడు పురుషోత్తం. ఆమె భర్త కేరళలో బిజినెస్ చేస్తాడు. ఇద్దరు ఆడపిల్లలు- చదువుకుంటున్నారు. భర్త ఆమెని చాలా ప్రేమగా చూస్తాడు. ఆమెని వదిలి అసలు వుండలేడు. అందుకే పెళ్ళవగానే కేరళ వెళ్ళిపోయిన ఆమె-అన్నగారింటికి రావడానికి పధ్నాలుగేళ్ళ కాలం పట్టింది.

చేసింది మాలతి. ఆమె వంట చేస్తూ- మాటల మధ్యలో తను కాలేజీ రోజుల కబుర్లు కూడా చెబుతోంది. వంటింటికి ఇవతల రూంలో ఏదో పుస్తకం చేత్తో పట్టుకుని కూర్చున్న పురుషోత్తం- ఊపిరి బిగపట్టి వింటున్నాడు. అన్నీ తనకి తెలిసిన కబుర్లే! తాము వెళ్ళిన పిక్‌నిక్‌ల గురించి- కొందరు లెక్చరర్స్ నిక్‌నేమ్స్ గురించి కూడా చెబుతోంది పెద్దగా నవ్వుతూ.

ఆమె మాటల్ని శ్రీలత, పార్వతితోపాటు పన్నెండేళ్ళ మాలతీలత కూడా ఎంజాయ్ చేస్తోంది. ఒకసారి స్టూడెంట్స్ అంతా పిక్‌నిక్‌కి వెళ్ళారు. మాలతి రవ్వలడ్డూ పొట్లాం కట్టి తెచ్చింది. హడావుడిలో లడ్లన్నీ చితికిపోయి రవ్వలడ్డూ కాస్తా 'రవ్వ'గా మిగిలింది. మాలతి రవ్వలడ్డూ గురించి అంతా తలో జోక్ చేసారు. అది కూడా చెప్పింది మాలతి. ''అదేం కాదు. అప్పటికి నీకసలు లడ్డు చేయడం వచ్చుండదు. రవ్వే తీసికెళ్ళి చితికిపోయాయి అనుంటావు అంతేనా'' అంది మాలతి వదిన ఆమెని ఆటపట్టిస్తూ. తరువాత పురుషోత్తం కూతురితో ''మాలా! ఆంటీ చేసిన ఈ టిఫిన్ తీసికెళ్ళి నాన్నకి పెట్టమ్మా. ముందు నాన్నగారి మీదే ప్రయోగం చేద్దాం ఈ కేరళ వంట'' అంది నవ్వుతూ.

మాలతి కొంచెం నోరు బిగించి- ''నన్నేం ఎగతాళి చేయనక్కరలేదు. ఒక్కసారి తింటే మీరే రోజూ నన్ను తల్చుకుని మరీ తింటారు. తెలుసా! ఉండండి- ఆయనకి నేనే ఇచ్చివస్తాను.'' అంటూ గబగబా ప్లేట్‌లో సర్ది పురుషోత్తమ్ వున్న గదిలోకి వెళ్ళి- ''చూడండీ ఈ వంట టేస్ట్ చూసి- కేరళ వంట కమ్మదనం గురించి మీరన్నా- మీ ఆవిడకి, మా వదినకి చెప్పండి-'' అంటూ నవ్వుతూ అందించింది. పురుషోత్తం ఆమె కళ్ళలోకి చూస్తూ అందుకున్నాడు. ఆమె కళ్ళతోనూ, నోటితోనే కాదు- తనువంతా నవ్వుతున్నట్టుగా వుంది.

మాలతి కళ్ళలోకే చూస్తూ- ''మీ కాలేజీ కబుర్లు నేను విన్నాను..'' ఆమె అలాగే నవ్వుతూ చూస్తోంది. అతనేదో చెప్పబోతున్నాడని అర్థమై- ''మీ రవ్వలడ్డూ ప్రహసనం బాగుంది కానీ ఒకటి- మీ చల్లని నవ్వుతోకలిసి ఆ రవ్వకాస్తా వెన్నెల బువ్వగా మారిపోయి వుంటుందేమో- అనిపిస్తుంది. మిమ్మల్ని చూస్తోంటే'' అతను మాలతి మొహంలోకి నిశితంగా పరిశీలించి చూస్తూ అన్నాడు. ఆమె తనదైన సహజ ధోరణిలోనే- ''భలేవారే- కవిత్వం చెబుతున్నారే'' అంటూ వెళ్ళిపోయింది అక్కడ్నించి.

పురుషోత్తంకి చాలా నిరాశగా అనిపించింది. ఆరోజు పిక్‌నిక్ స్పాట్‌లో ఆమె ఒంటరిగా వున్నప్పుడు ఇదే మాటన్నాడు తను. తనకి బాగా గుర్తుంది. ఆమెకి గుర్తొస్తుందేమోనని అన్నాడు. కానీ ఆ ఛాయలేమీ ఆమె మొహంలో కనబడలేదు. అందుకే ఆ నిరాశ. అతనా రాత్రి కూడా ఆ ఊగిసలాటలోనే వుండి- చివరికి ఆమెకి తనెవరో చెప్పాలనే నిర్ణయానికి వచ్చాడు. అయితే అదీ ఆమె ఒంటరిగా దొరికితేనే. ఆ అవకాశం తరువాత రోజు సాయంత్రం దొరికింది.





పురుషోత్తం ఆఫీస్ నుండి వచ్చేసరికి తమ ఇంటికి తాళం వేసి వుంది. మాలతి తమింట్లోంచి తాళం తెచ్చి ఇచ్చింది. ''మా వదిన, శ్రీలతగారు షాపింగ్‌కి వెళ్ళారు. పిల్లలు స్కూల్ నుండి వచ్చి ట్యూషన్‌కి వెళ్ళారు.'' చెప్పి- అతను తాళం తీసాక- ''టీ నేను పెట్టాను. మా ఇంటికి రండి'' పిల్చి వెళ్ళిపోయింది. పురుషోత్తంకి ఇంతకంటే మంచి అవకాశం రాదనిపించింది.

కాళ్ళు, మొహం కడుక్కుని బట్టలు మార్చుకుని వెళ్ళాడు, మనసులోనే మాటలు ఎలా

మొదలుపెట్టాలో ఊహాగానం చేస్తూ. ఆమె జీడిపప్పు దట్టంగా వేసిన ఉప్మాప్లేటు అతనికి అందించింది. అతను మనసులో మాటల్ని పేర్చుకుంటూ మౌనంగా ఉప్మా తిన్నాడు. దాని రుచి నాలుకకి ఏమాత్రం తగలలేదు. ఆ సమయంలో ఆ ప్లేట్‌లో కొంచెం గడ్డి పెట్టినా అతను మామూలుగా నే తినేసేవాడు. ఆమె కాఫీ ఇచ్చింది. తాగాడు.

మాలతి ఆ ప్లేట్-గ్లాసులు అన్నీ తీసేసి వచ్చి- అతని ఎదురుగా కూర్చుంటూ- ''మిమ్మల్ని గుర్తుపట్టాను పురుషోత్తం గారూ'' అంది. ఆమెని మొదటిసారి తమింట్లో చూసినప్పటి సంభ్రమాశ్చర్యాలు వెయ్యింతలై కలిగాయి అతనికి. ఆశ్చర్యానందాలు కళ్ళలో చూపించడం తప్ప- ఏం మాటాడాలో తెలియలేదు. ఒక్కొక్కసారి మౌనాన్ని చూస్తే తెగ చిరాగ్గా వుంటుంది. ఎన్నో చెప్పాలని మనసు తహ తహ లాడుతున్నా- ఒక్కమాట కూడా గొంతు పెగలి రాకపోతే- మౌనం అంత బాధాకరమైనది మరేముంటుంది. అలాగే వుంది పురుషోత్తం పరిస్థితి ఎలా ఎలా విప్పి చెప్పాలి మాలతికి ఇన్నాళ్ళ తన మౌన ఆరాధన.

అది ఆరాధనేనా- పెళ్ళి చేసుకుని- ఉద్యోగం చేస్తూ- పిల్లల్నికని- సంఘంలో సాధారణ జీవితం గడుపుతూ- సహజంగా- అతిసహజంగా బ్రతికేస్తూ కూడా ఇంకా తను ఆమెని ఆరాధిస్తున్నాడా- కాదేమో, కేవలం ఆనాటి జ్ఞాపకాల బలమేమో- దానిని ఆమె గుర్తించాలన్న తపనేమో- ఏమో- అతనికే అర్థం కానట్టు తయారయింది అతని పరిస్థితి.

ఆమె అతన్ని అంచనా వేసినట్టుగా, ''మీరు రవ్వలడ్డు గురించి కామెంట్ చేసినపుడు గుర్తుపట్టాను. ఆ తరువాత ఆలోచిస్తే- మీ పాపపేరు మీ ఇంటిపేరు, తల్చుకుంటే కొంచెం బాధనిపించింది.'' అతను ఆశ్చర్యంగా చూశాడు. ''నిజం పురుషోత్తంగారూ, ఈ పదిహేనేళ్ళలో మీరు కనీసం ఒక్కసారైనా నాకు గుర్తువచ్చిన జ్ఞాపకం లేదు, అంటే నమ్ముతారా! నాభర్త, ఆయన ప్రేమ, పూర్తి ఆనందాన్ని ఇచ్చిన వైవాహిక జీవితం, పిల్లలు- నేను జీవితంలో పరిపూర్ణమైన ఆనందాన్ని అనుభవిస్తున్నాను. కానీ మీ మనసులో నా జ్ఞాపకాలున్నాయనీ- అవి అప్పుడప్పుడూ మిమ్మల్ని ముల్లులా గుచ్చుకుంటూ బాధిస్తున్నాయని తెలిసి నాకు చాలా బాధనిపించింది. గిల్టీగా కూడా ఫీలయ్యాను. మీ భార్యాపిల్లలకు చెందవలసిన పూర్తి ప్రేమ, కొంతవరకు నావలన ఇలా వృధా అవుతున్నట్టే కదా.

మీరే ఇలా వున్నారంటే- నాకు సడెన్‌గా, మీ ఆలోచనల్లోనే మూర్తి గుర్తొచ్చాడు. మీ మనసులోనే నేనింత గాఢంగా వున్నానంటే- మూర్తి కూడా ఇలాగే ఇంకా నన్ను ప్రేమిస్తున్నాడా, అనే అనుమానం నన్ను ఇంకా బాధిస్తోంది.'' ఆమె ఆ మాటన్నాక గుర్తొచ్చింది పురుషోత్తంకి, ఆ రోజుల్లో మాలతి, మూర్తి చాలా గాఢంగా ప్రేమించుకున్నారు. ఆ విషయం అందరికీ తెలుసు. తనది వన్‌వే ట్రాఫిక్ ప్రేమకాబట్టి, మనసు బాధ పడుతున్నా, ఆ విషయాన్ని మర్చిపోవడానికే ప్రయత్నించాడు. అందుకే కాలం గడిచే కొద్దీ మాలతిపట్ల ఆరాధన సజీవంగా వున్నా, మూర్తి విషయం మరపు పొరల్లోకి వెళ్ళిపోయింది. అయితే మాలతి, మూర్తి పెళ్ళి చేసుకోలేదన్నమాట. ''చూడండీ, మీకెప్పుడన్నా మూర్తి కలిస్తే, నా ప్రసక్తి మీ మాటల్లో వస్తే- ఇప్పుడు నేను మీతో చెప్పినదంతా ఆయనతోనూ చెప్పండి. నా జీవితంలో లేని లోటు మీ జీవితాలలో వుండటం ఏం న్యాయం.'' ఖచ్చితంగా చెప్పింది మాలతి.

ఇక మాటలు లేనట్టుగా- మౌనంగా లేచి ఇంట్లోకి వచ్చేసాడు పురుషోత్తం. అయితే ఆమె 'నా గురించి మీరు బాధపడటం నేను తట్టుకోలేను' అన్న మాట చిత్రంగా పురుషోత్తంకి ఆనందాన్నిస్తోంది. ఆ రాత్రి ఆ ఆలోచనల్లోనే అతనికి ఓ విషయం స్ఫురించింది. మాలతి మధనపడుతున్నది నిజంగా తన గురించా లేక- ఇదే పరిస్థితుల్లో వున్నాడేమోనని తను అనుమానిస్తున్న మూర్తి గురించా!

అతని మనసు స్పష్టంగా చెప్పింది.

అనుమానమేముంది- ఆమెనీలో మూర్తినే చూసింది. నిన్నుకాదు. అతని ఆనందం కాస్తా ఆరిపోయింది. మరో ఆరునెలలకి పురుషోత్తంకి ఓ రైల్వేస్టేషన్‌లో హఠాత్తుగా మూర్తి కలిశాడు. పది నిముషాలు మాటాడగానే అర్థమైంది. అతని ఆలోచనల్లో మాలతి సజీవంగా వున్నదని. పురుషోత్తం ఉత్సాహంగా మాలతి కలవడం గురించి చెప్పాడు. అయితే- అంతా నిజం చెప్పలేదు.


''పాపం మాలతి చాలా పాడైపోయింది గురూ!

అసలు అప్పటి మాలతికి ఇప్పటి మాలతికి పోలికేలేదు. ఆమె భర్త చాలా క్రూరుడు, ఒట్టి అనుమానపు పీనుగట-చాలా బాధలు పడుతున్నట్టుగా వుంది మనిషిని చూస్తేనే- నిన్ను తల్చుకుని ఎంతగా బాధ పడిందని. నన్ను ప్రేమించిన మూర్తిని కాదన్నందుకు నాకు దేవుడు తగిన శాస్తి చేశాడని ఎంత పశ్చాత్తాపపడిందనీ.....'' చెమ్మగిల్లుతున్న మూర్తి కళ్ళని చూస్తూ ఇంకా చాలా చెప్పాడు పురుషోత్తం.

అన్ని అబద్ధాలు ఆడిన అతను-'అలా ఎందుకు చెప్పాను నేను'- అని తన అంతరంగాన్ని తను ప్రశ్నించుకోలేకపోయాడు. ఒకవేళ ప్రశ్నించుకుని వుంటే అక్కడ అసలు సమాధానమే వుంది.

''మూర్తిస్థానంలో నీ మనసు నిన్నే ఊహించుకుని తృప్తిపడిందని.'

★






## 'ఆమని' కాదు 'అమీనాబాయి'!

**ఇది మరో శ్రీదేవి కథ! సినిమా అవకాశాలు తగ్గిపోతాయనో లేక అవసరం ముంచుకొచ్చినప్పుడే బయట పెట్టొచ్చన్న ధీమానో తెలియదుగానీ శ్రీదేవి గర్భవతి అయ్యాక ప్రెగ్నెన్సీకి రెండునెలలు ముందుగా బోనీకపూర్‌తో తన పెళ్లి విషయం బయటపెట్టింది. ఇప్పుడు మరో తెలుగుతార అలాగే... ఆ తార పేరు-ఆమని! మనకున్న ఓ మంచి నటి నిజ జీవితంలోనూ నటించి ప్రేక్షకులను మోసగించాలని చూసింది. లేకపోతే, మొన్నటికి మొన్న 'సీతక్క' సినిమా షూటింగ్‌లో కలిసినప్పుడు తన పెళ్లి వాయిదా పడిందనీ, తనమీద అపరిమిత అభిమానం చూపించే తెలుగు ఇండస్ట్రీని వదిలి వెళ్లలేక తనే పెళ్లి వాయిదా వేసుకున్నానని చెప్పిన ఆమని ఇంతలోనే గర్భవతా?! ఆమెకిప్పుడు ఆరోనెల!... ఆమె పారిశ్రామికవేత్త అయిన ఓ ముస్లింని రహస్యంగా పెళ్లిచేసుకుందని వినికిడి. ఆ జంట సంతోషంగా వున్నారని, 'శుభముహూర్తం' చిత్రమే ఆమని నటించే ఆఖరిచిత్రం కాబోతుందని ఆమె సన్నిహితులు తెలిపారు. అన్నట్టు ఆమని ముస్లిం మతంలోకి కన్వర్ట్ అయింది. ఆమె పేరు ఇప్పుడు ఆమని కాదు... అమీనాబాయి!**

-జె.వి.బాబు